


## మహాదేవుడు.. బోధన్ చక్రేశ్వరుడు

బోధన్, మార్చి 7: బోధన్‌లోని శ్రీ చక్రేశ్వర శివ మందిరం మట్టి తవ్వకాల్లో బయటపడింది. 1959 ఫిబ్రవరి 7 (అమావాస్య)రోజున ఒక రైతు మట్టిదిబ్బను చదునుచేస్తుండగా... నల్లని రాతితో ప్రకాశవంతమైన శివలింగం, గర్భగుడి, పైన శిఖరంతో చెక్కు చెదరని రీతితో బయటపడింది. బోధన్‌కు ఏకచక్ర పురం అనే పేరు ఉండడంతో ఇక్కడి శివలింగానికి ఏకచక్రేశ్వరుడు, చక్రేశ్వరుడు అని పేర్లు పెట్టారు. త్రేతాయుగంలో రాక్షస సంహారం కోసం బయల్దేరిన పరశురాముడు ఈ శివలింగాన్ని ప్రతిష్ఠించాడన్న స్థల పురాణం ఈ ఆలయానికి ఉన్నది.



రైతులతో కలిసి పంట కాలువ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

## ఇందూరు కంఠాభరణం నీలకంఠేశ్వరాలయం



శంభుని గుడి



విద్యుద్దీపాలంకరణలో నీలకంఠేశ్వరాలయం

సుభాష్‌నగర్, మార్చి 7: ఇందూరు కంఠాభరణమైన నీలకంఠేశ్వరస్వామి ఆలయంతోపాటు ప్రసిద్ధిగాంచిన శంభులింగేశ్వరాలయం, ఉమామహేశ్వర ఆలయం, నగరేశ్వరాలయం, మనోకామేశ్వరాలయం, మార్కండేయ మందిరం, నాందేవ్‌వాడ సాయిబాబా, నాగారంలోని నందిగుట్ట ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి మహాన్యాస పూర్వక లింగోద్భవ నిశి పూజ కార్యక్రమం, ఉదయం నుంచి అభిషేకాలు, విశేష పూజలు, సాంస్కృతిక, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నీలకంఠేశ్వర, శంభులింగేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు మహాశివరాత్రి

ఉమ్మడి జిల్లాలో ముస్తాబైన శైవక్షేత్రాలు

శివనామస్మరణతో మార్మోగనున్న ఆలయాలు

ఉపవాస దీక్షలు ఆచరించనున్న భక్తులు

# శివపూజకు వేళాయె..

పవిత్రమైన మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగనున్నాయి. ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు.

## కాశీకి వెళ్లినంత పుణ్యం.. సోమేశ్వరాలయ దర్శనం



నస్రుల్లాబాద్, మార్చి 7 : కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామ శివారులోని సోమలింగేశ్వరాలయానికి 1500 ఏండ్ల ఘనమైన చరిత్ర ఉన్నది. ఈ ఆలయాన్ని దర్శిస్తే కాశీలోని శివాలయాన్ని దర్శించినంత పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. సుమారు 1500ఏండ్ల క్రితం ఈ ప్రాంతాన్ని సోమభూపాలుడనే మహారాజు పరిపాలించాడు. ఆయన పరిపాలనలో స్వయం భూలింగంగా వెలిసిన లింగానికి సర్వాంగ సుందరంగా శిల్పకళా నైపుణ్యంతో ఆలయాన్ని నిర్మించడం విశేషం.

## భిక్కనూరు సిద్ధరామేశ్వర ఆలయం..



భిక్కనూర్, మార్చి 7: భిక్కనూర్‌లోని స్వయంభూలింగం శ్రీ సిద్ధ రామేశ్వర స్వామి ఆలయం శివరాత్రి వేడుకలకు సిద్ధమైంది. ఆలయంలో వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహిస్తారు. భక్తులు ఆలయంలోని మూల బావి వద్ద స్నానమాచరించి, స్వామివారిని దర్శించుకుంటారు. అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో స్వామి వారికి మహారుద్రాభిషేకం, ఆవుపాలతోఅభిషేకాలు నిర్వహిస్తారు.

## పంటలను ఎండనివ్వం అన్నదాతకు అండగా ఉంటాం..

### మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

చందూర్, మార్చి 7: రైతన్నలకు అండగా ఉంటామని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. సాగునీరందించి పంటలను కాపాడుతామన్నారు. గురువారం ఆయన మండలంలోని మేడ్‌పల్లిలో పర్యటించారు. రైతులు సాగుచేస్తున్న పంటలతోపాటు కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. ఇటీవల పంటలకు చెరువుల నుంచి నీరందిస్తున్న కాలువల్లో మట్టిపేరుకుపోవడాన్ని మాజీ సర్పంచ్ రవి ద్వారా తెలుసుకున్న పోచారం.. తన సొంత ఖర్చు రూ. 2లక్షలతో కాలువ పూడికతీత పనులను చేపట్టారు. గ్రామంలో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ..గ్రామంలోని లక్ష్మీసాగర్ తండాకు రెండు కాలువలు ఉండగా.. కుడి కాలువ, ఎడమ కాలువ ద్వారా సుమారు వెయ్యి ఎకరాల్లో పంటలను సాగుచేస్తున్నారని తెలిపారు. చెరువుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నప్పటికీ పిల్ల కాలువల్లో మట్టి పేరుకుపోయి పంటలకు నీరు సరిగ్గా అందడం లేదన్నారు. దీంతో సర్వే చేయించి రూ. 5 కోట్లతో మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. కుడి కాలువ ద్వారా లక్ష్మాపూర్ నుంచి తిమ్మాపూర్ వరకు నీరు సాఫీగా వెళ్తున్నదని, ఎడమ కాలువలో గడ్డి, మట్టి పేరుకుపోయి నీటి ప్రవాహం తగ్గిందని అన్నారు. మరమ్మతుల కోసం రూ. 2 లక్షలు అవసరమవుతాయని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నిధుల విడుదల ఆలస్యమవుతున్న నేపథ్యంలో పంటలు ఎండకుండా ఉండాలనే ఉద్దేశంతో తన సొంత నిధులతో మరమ్మతులు చేపట్టినట్లు వివరించారు.

## ఎల్ ఆర్‌ఎస్‌కు ఫీజులు వసూలు చేయొద్దు

కామారెడ్డి, మార్చి 7: ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఆమోదించాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ డిమాండ్ చేశారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకకులు ఎల్‌ఆర్‌ఎస్ కార్యక్రమాన్ని ఎలాంటి ఫీజులు లేకుండా చేపడతామని హామీ ఇచ్చి.. అధికారంలోకి రాగానే ప్రజల నుంచి ఫీజులు దండుకోవాలని చూస్తున్నారన్నారు. సీఎం ఇచ్చిన మాట మేరకు ప్రజల భూములను ఉచితంగా క్రమబద్ధీకరించాలని అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ఫీజులు కట్టాలని ఫోన్లు రాకుండా ప్రభుత్వాధికారులు చూడాలని అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రారంభ శిలాఫలకాన్ని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తొలగించి ప్రధాని మోదీ ఫొటోను పెట్టడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, నల్లవెల్లి అశోక్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్, నాయకులు



### అటవీ ప్రాంతంలో వెలసిన బుగ్గ రామలింగేశ్వరుడు

రామారెడ్డి, మార్చి 7: మండలంలోని మద్దికుంట అటవీ ప్రాంతం లో వెలసిన శ్రీ బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. మహాశివరాత్రి సందర్భంగా శివ పార్వతుల కల్యాణంతోపాటు మూడురోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమాలకు ఉమ్మడి జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఇక్కడ 25 ఏండ్ల నుంచి నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

## బోధన్ ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్‌పై వేటు

### సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసిన ఎక్సైజ్‌శాఖ కమిషనర్

### నూతన సీఐగా పవన్ గౌడ్ బాధ్యతల స్వీకరణ

శక్కర్‌నగర్, మార్చి 7: బోధన్ ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్‌పై అధికారులు వేటు వేశారు. ఆయనను సస్పెండ్ చేస్తూ ఎక్సైజ్‌శాఖ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దాడులు చేసినా కేసుల నమోదులో జాప్యం చేయడం, కార్యాలయానికి వచ్చేవారితో దురుసుగా ప్రవర్తించడం, సీజ్ చేసిన మద్యం రికవరీ తదితర అంశాల్లో ఆయనపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో ఆయనను తక్షణం విధుల నుంచి సస్పెండ్ చేస్తూ, సదరు ఫిర్యాదులపై శాఖాపరంగా విచారణ జరిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

**నూతన సీఐగా పవన్ గౌడ్..**

రూప్‌సింగ్‌ను సస్పెండ్ చేయడంతో ఆయన స్థానంలో పవన్ గౌడ్‌ను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

## భూములు కోల్పోతాం.. బైపాస్ రోడ్డు వద్దు..

### మోర్తాడ్ మండల కేంద్రంలో రైతుల ఆందోళన

మోర్తాడ్, మార్చి7: మోర్తాడ్ మండల కేంద్ర శివారులో బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టవద్దని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మోర్తాడ్‌లో గురువారం రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గతంలో రైల్వేలైన్, వరద కాలువ కోసం తాము భూములను కోల్పోయామని తెలిపారు. మళ్లీ ఇప్పుడు జాతీయరహదారి విస్తరణలో భాగంగా బైపాస్‌రోడ్డు నిర్మాణం చేపడితే మరిన్ని భూములను కోల్పోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ధర్నా విషయం తెలుసుకున్న తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై అనిల్‌రెడ్డి అక్కడికి చేరుకొన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణం విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.




నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

# ధీర వనితలు

దేశ భద్రతలో భాగస్వాములు

సీఐఎస్‌ఎఫ్‌లో సేవలందిస్తున్న నారీమణులు

ఆదర్శంగా నిలుస్తున్న అక్కాచెల్లెళ్లు

నేడు ప్రపంచ మహిళా దినోత్సవం

**అవని నుంచి ఆకాశం దాకా..** ఇంటి బాధ్యతల నుంచి దేశ భద్రత దాకా.. 'ఆమె' లేని చోటు లేదు. సకల రంగాల్లో ఆమె ప్రతిభకు సాటిలేదు. ఒకనాడు వంటింటికే పరిమితమైన అతివ.. అడ్డంకులను ఎదురొడ్డి నిలిచింది. పురుష ఆధిపత్యాన్ని అధిగమించి అంతరిక్షం దాకా ఎదిగింది. పురాతన కళల నుంచి అధునాతన సాంకేతిక రంగాల్లో సత్తాచాటి గెలిచింది. రాజకీయాల్లో అవకాశాలను అందిపుచ్చుకుంటూ శాసించే స్థాయికి సైతం చేరింది. దేశ సంరక్షణలో కూడా మహిళలు తమదైన ముద్ర వేసుకుంటున్నారు. ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా.. దేశ సేవలో నిమగ్నమైన అక్కాచెల్లెళ్ల గురించి ప్రత్యేక కథనం.

– నిజాంసాగర్, మార్చి 7



**16ఏండ్లుగా దేశసేవలో..**

దూప్‌సింగ్ తండాకు చెందిన కడావత్ బలరాం– బూలిబాయిల కుమార్తె పద్మ. వీరిది రైతు కుటుంబం. పద్మ 2008లో సీఐఎస్‌ఎఫ్ విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఢిల్లీ, బెంగుళూరు, గుజారాత్‌తోపాటు వివిధ రాష్ట్రాల్లో విధులు నిర్వర్తించిన పద్మ ప్రస్తుతం హైదరాబాద్ విమానాశ్రయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈమె భర్త సైతం ప్రస్తుతం ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఒక పాప, ఒక బాబు ఉన్నారు. ఇటు కుటుంబభారం మోస్తూనే విధులు నిర్వర్తించడం విశేషం.

**పోలీసు కొలువు సాధించి..**

కడావత్ గోపాల్– బిజన్‌బాయి దంపతుల కూతురు కడావత్ ప్రియాంక. క్రీడల్లో సత్తా చాటుతూ ఇటీవలే పోలీసు కొలువు సాధించింది. ప్రస్తుతం పోలీసు శిక్షణలో ఉంది. పేద కుటుంబానికి చెందిన ప్రియాంక చిన్నతనం నుంచి ఎంతగానో కష్టపడి క్రీడల్లో రాణించింది. క్రీడాకోటలో పోలీసు కొలువు సాధించింది. తన లక్ష్యమైన పోలీసు ఉద్యోగాన్ని సాధించడంపై హర్షం వ్యక్తంచేస్తున్నది. తెలంగాణ వాలీబాల్ కెప్టెన్‌గానూ ప్రియాంక సేవలందించింది.



**భర్త మరణించినా..**

దూప్‌సింగ్ తండాకు చెందిన గంగారాం కుమార్తె సబావత్ విజయ. 2004లో సీఐఎస్‌ఎఫ్ విధుల్లో చేరిన ఆమె ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రం బరోడాలో విధులు నిర్వహిస్తున్నారు. 2004లో విధుల్లో చేరిన తర్వాత మూడేండ్ల అనంతరం 2007లో భర్త మృతి చెందాడు. భర్త మృతి చెందినప్పటికీ దేశ సేవకోసం ముందుకు నడిచారు. ఇప్పటి వరకు ముంబాయి, చెన్నై, జైపూర్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో పనిచేశారు.




**17ఏండ్లుగా సీఐఎస్‌ఎఫ్‌లో..**

శ్రీరాం–మంగ్లీబాయి దంపతుల కుమార్తె కృష్ణవేణి. ఈమె 2007లో సీఐఎస్‌ఎఫ్‌లో చేరారు. ఇప్పటి వరకు ఢిల్లీ, బెంగుళూరు, చెన్నైలో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం కర్ణాటకలోని బళ్లారీలో పనిచేస్తున్నారు. కృష్ణవేణి భర్త సైతం ఆర్మీలో విధులు నిర్వర్తిస్తున్నారు.



దేశ రక్షణ కోసం తామేమీ తక్కువ కాదంటూ పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారు. భారతజాతి సంరక్షణ కోసం అహర్నిశలు విధులు నిర్వర్తిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు.. ఒకే రైతు కుటుంబానికి చెందిన ముగ్గురు మహిళలు సీఐఎస్‌ఎఫ్‌లో విధులు నిర్వహిస్తూ.. దేశ భద్రతలో భాగస్వాములయ్యారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని దూప్‌సింగ్ తండాకు కడావత్ పద్మ, కడావత్ కృష్ణవేణి, సబావత్ విజయ సీఐఎస్‌ఎఫ్ విభాగంలో ఒక్కొక్కరూ ఒక్కో రాష్ట్రంలో పనిచేస్తున్నారు. వీరంతా అన్నదమ్ముల కుటుంబానికి చెందినవారు కావడం విశేషం. నిత్యం కట్టుకున్న భర్తతోపాటు కన్న పిల్లలను లాలిస్తూ ఇటు కుటుంబాన్ని అటు భరత మాత సేవలో భాగస్వాములవుతున్నారు.




## మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఖలీల్‌వాడి, మార్చి 7: వసతిగృహాల్లోని విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. జడ్పీ స్థాయీ సంఘ సమావేశం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని పెట్టాలని, దుప్పట్ల కొరత లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తే సంబంధిత అధికారులే బాధ్యులవుతారన్నారు. జడ్పీ సీఈవో, జడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.





